ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్
STATE VISION

శుక్రవారం 30-10-2026 పేజీలు : 16

కట్టకు కష్టం.. బ్లాస్టింగ్‌లతో ముప్పు!

4 పేజీలో...

ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయండి

'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026" కర్టెన్ రైజర్ లో మంత్రి శ్రీధర్ బాబు

సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్) 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఫ్యాబ్ ఇండస్ట్రీ, చిప్ డిజైన్ విభాగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా ఎదిగేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ – 2026" కర్టెన్ రైజర్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర డిఫెన్స్ ఎగుమతులు గతంతో పోలిస్తే 103 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2030 నాటికి 5 గిగావాట్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి

11 పేజీలో...

దేశం కోసం యువత నడుం బిగించాలి

: ఎంపీ శ్రీమతి డీకే అరుణ

29, అక్టోబర్, 2026: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో మేరా యువ భారత్ మహబూబ్‌నగర్, ఉద్భవ్ సేవా సంసద్ ఆధ్వర్యంలో "యువ సంసాద్" కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

13 పేజీలో...

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు

- అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- యాసంగిలో వరి సాగు వద్దని రైతులకు హితవు
- మాధవనగర్ ఆర్.ఓ.బీ పనులకు రూ. 42 కోట్లు కేటాయించామని వెల్లడి

3 పేజీలో...

నీరు లేక వెలవెలబోతున్న సింగూరు,మంజీరా ప్రాజెక్టు!

- అక్టోబర్ మాసంలోనే డెడ్ స్టోరేజీ సింగూరు ప్రాజెక్టు..
- భవిష్యత్తులో తాగునీటి కష్టాలు తప్పవా?
- వర్షాకాలంలోనే తగ్గుతున్న నీటి నిల్వలు
- రానున్న రోజుల్లో హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పవనే ఆందోళన
- కల్లెపల్లి వద్ద మోటార్లు ఏర్పాటు చేసి నీటిని లిఫ్ట్ చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్న విమర్శకులు

చౌటకూర్ అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర):- సంగారెడ్డి జిల్లాలో పుల్కల్ మండలం పరిధిలోని మంజీరా నది నీటి ప్రవాహం తగ్గిపోవడంతో సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వలు క్రమంగా తగ్గి వెలవెలబోతున్నాయి. ఒకప్పుడు సమృద్ధిగా నీటితో కళకళలాడిన సింగూరు ప్రాజెక్టు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుతూ డెడ్ స్టోరేజీ దిశగా పయనిస్తుండటంతో భవిష్యత్తులో తాగునీటి అవసరాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

13 పేజీలో...

అభివృద్ధి పనులపై కమిషనర్ క్షేత్రస్థాయి సమీక్ష

- → వరద కాలువ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి
- → రోడ్డు విస్తరణకు విద్యుత్ స్తంభాల తరలింపు వేగవంతం
- → ఆక్రమణలు తొలగించి సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి

6 పేజీలో...

భక్తి కుంటేే ముక్తి - మెట్టు లక్ష్మన్

బాల్కొండ (నిజామాబాదు జిల్లా)విజన్ ఆంధ్ర అక్టోబర్ 29:- భక్తి కుంటే ముక్తి లభిస్తుందని బాల్కొండ లోని శబరి మాత ఆశ్రమ నిర్వహకులు మెట్టు లక్ష్మ న్ అన్నారు. గురువారం రోజు బాల్కొండ లో శబరి మాత భక్తులు ఆదిలాబాద్, నిజామాబాదు మరియు కరీంనగర్ నుండి రత యాత్ర లో భాగంగా శబరి మాత రతాన్ని పలు వీదుల్లో రామ లక్ష్మన, పలు వేశ ధారణతో కోలాటాలు చేస్తూ పలు వీధుల్లో ఊరేగింపుగా భజనలతో కీర్తనలు చేసారు. దీంతో బాల్కొండ లోని భక్తులు కూడా శబరి మాత రతాన్ని అనుసరిచారు.

మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

ముధోల్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): మండలంలోని చించాల గ్రామంలో గురువారం మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు సర్పంచ్ దొడ్డికింది సర్వేశ్, ఉప సర్పంచ్ పీసర సాయినాథ్ గౌడ్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘం భవనం నిర్మాణం పూర్తయితే మహిళలు ఒకచోట సమావేశమై తమ సమస్యలను చర్చించుకోవడంతో పాటు స్వయం ఉపాధి, పొదుపు సంఘాల కార్యకలాపాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎంతగానో ఉ పయోగపడుతుందని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఇలాంటి భవనాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లవకుమార్, ఏపీవో శిరీష, ఏపీఎం గురు చరణ్, సీసీ జ్యోతి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు కన్నోల్ల రవి, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టైగర్ జోన్ రద్దు కోసం చేస్తున్న దీక్షకు మద్దతుగా ట్రాక్టర్ అసోసియేషన్

జన్నారం, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : టైగర్ జోన్ రద్దు చేయాలని చేస్తున్న దీక్షకు ట్రాక్టర్ అసోసియే షన్ సభ్యులు మద్దతు తెలిపారు. కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని జన్నారం మండలకేంద్రం లోని అంబేద్కర్ విగ్రహం ముందు పోనకల్ గ్రామా నికి చెందిన సామాజిక పోరాట వేత్త శ్రీరాముల భూమాచారి 68 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షకు గురువారం రోజున ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైగర్ జోన్ రద్దు చేసేంత వరకు భూమాచారి చేస్తున్న ఉద్యమాన్ని ఆపే ప్రసక్తేలేదని ఆయనకు మా అసోసియేషన్ పూర్తి మద్దతుగా ఉంటుందని అన్నారు. మున్ముం దు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ట్రాక్టర్ అసోసి యేషన్ సభ్యులు బొంతల చంద్రమౌళి, అనుముల శ్రీని వాస్, కొత్త తిరుపతి ,కాశెట్టి శ్రీనివాస్, కటకం సతీష్, రాథోడ్ తుక్కారం తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్ల నిధులు

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బీసీ నాయకులు

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 30: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేసింది. కోకాపేటలో గత ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో భవన నిర్మాణం కోసం మొత్తం రూ. 10 కోట్లు కేటాయించగా, అందులో భాగంగా తొలి విడత నిధుల చెక్కును బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి అందజేశారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ, ఎమ్మెల్యేల కల్చరల్ సెంటర్‌లో మున్నూరు కాపు సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లికి చెందిన తెలంగాణ రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకుడు, జర్నలిస్టు తెల్ల హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో అవినాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

-తలసేమియా బాధితులకు రక్తదానం ఎంతో ఉపయోగకరం

బెల్లంపల్లి అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర): బెల్లంపల్లి పట్టణంలోని కాల్‌టెక్స్ ప్రాంతంలో ఉన్న సనాతన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులతో పాటు స్థానిక యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం ఎంతో అవసరమని, ఇలాంటి రక్తదాన శిబిరాలు వారి ప్రాణాలను కాపాడేందుకు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం పట్ల యువతలో అవగాహన పెంపొందించడంతో పాటు, ఆపదలో ఉన్న రోగులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సనాతన సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్ కీర్తన, కంపెనీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గజల్ మోహన్, వేల్పుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ విద్యార్థులకు ఆటోక్యాడ్ శిక్షణ

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాల పెంపు

బెల్లంపల్లి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : మైనింగ్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు పట్టు కల్పించే లక్ష్యంతో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆటోక్యాడ్ శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. మైనింగ్ ఇంజినీర్ల సంఘం ఆఫ్ ఇండియా సౌజన్యంతో మైనింగ్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు వారం రోజుల పాటు ఈ శిక్షణ అందించనున్నారు.

ఈ కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మందమర్రి ఏరియా ఉప ప్రధాన ప్రబంధకుడు వేముల మురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం. దేవేందర్ మారాం కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. శిక్షకుడు దినకర్ విద్యార్థులకు ఆటోక్యాడ్‌లో శిక్షణ అందిస్తున్నారు.

ఈ సందర్భంగా మైనింగ్ రంగంలో కంప్యూటర్ ఆధారిత రూపకల్పనకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. గనుల రంగంలో ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను సాధించడం ద్వారా పరిశ్రమల్లో మెరుగైన ఉద్యోగావకాశాలను పొందవచ్చని పేర్కొన్నారు. వారం రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత రూపకల్పనపై ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించనున్నారు. దీనివల్ల సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకునేందుకు అవకాశం కలుగుతుందని కళాశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.

కార్యక్రమంలో విద్యుత్, ఎలక్ట్రానిక్స్, పరికరాల నియంత్రణ, స్వయంచాలక యంత్రాలు, రోబోటిక్స్ విభాగాల అధిపతులు, మైనింగ్ విభాగ అధ్యాపకులు, చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక శిక్షణ అందించేందుకు సహకరించిన మైనింగ్ ఇంజినీర్ల సంఘం ఆఫ్ ఇండియాకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. దేవేందర్ మారాం కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

-బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

కొమురవెల్లి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన ఎక్కలదేవి లక్ష్మి 13000/–, కాపర్తి కృష్ణమూర్తి 45000/– ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి(CMRF) చెక్కును బిఆర్ఎస్ పార్టీ నాయకులు అందజేశారు. CMRF చెక్కును సంబంధిత బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలని బాధిత కుటుంబానికి సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉండి ఆర్థిక సాయం CMRF వచ్చేలా సహాయ సహకారాలు అందించిన జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి సిలివేరు సిద్ధప్ప, ఏర్పుల మహేష్, గొల్లపల్లి ఆంజనేయులు, గొల్లపల్లి కిష్టయ్య, పోతుగంటి శ్రీనివాస్, సిలివేరు కనకమల్లేష్, గొల్లపల్లి నాగరాజు, పోట్ల చెరువు తిరుపతి, మారగోని రాజు గౌడ్, అంబడిపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

భిక్కనూర్ అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర భిక్కనూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసు ఫైళ్లు, పెండింగ్ ట్రయల్ ఫైళ్లను పరిశీలించి, కేసుల ప్రస్తుత స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన దర్యాప్తుతో కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.

అలాగే, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, రాత్రి గస్తీని పటిష్టంగా నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు మరియు కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఈ తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించి, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. కామారెడ్డి డి.ఎస్.పి మధుసూదన్, సిఐ, నరేష్ ఎస్సై అనిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

వరి సాగుపై రైతులకు క్షేత్రస్థాయి శిక్షణ

బెల్లంపల్లి అక్టోబర్ 29 విజన్ ఆంధ్ర :వరి సాగులో రైతులు మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించి, చీడపీడలు, తెగుళ్లను సమర్థంగా నివారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఆత్మ ఆధ్వర్యంలో గురువారం గురజాల గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు రైతులతో కలిసి వరి పొలాల్లో పర్యటించారు. ప్రస్తుత పంట దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతోపాటు, పొలాల్లో కనిపించే వివిధ రకాల చీడపీడలు, తెగుళ్లను ప్రత్యక్షంగా గుర్తించారు. వాటి లక్షణాలు, పంటపై చూపే ప్రభావం, నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై రైతులతో చర్చించారు. పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యను తొలిదశలోనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పొలమే పాఠశాల.. రైతులే విద్యార్థులు

క్షేత్ర పాఠశాల ద్వారా రైతులు పొలంలోనే ప్రత్యక్షంగా పంట పరిస్థితులను పరిశీలించి, ఆచరణాత్మక శిక్షణ పొందారని బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి సుద్దల ప్రేమ్ కుమార్ తెలిపారు. పంట యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

కార్యక్రమంలో బెల్లంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) సీహెచ్ తిరుపతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు

- అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

- యాసంగిలో వరి సాగు వద్దని రైతులకు హితవు

- మాధవనగర్ ఆర్.ఓ.బీ పనులకు రూ. 42 కోట్లు కేటాయించామని వెల్లడి

నిజామాబాద్, అక్టోబర్ 29 :(విజన్ ఆంధ్ర) ఎల్ నినో ప్రభావంతో విపత్కర పరిస్థితులు నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్దంగా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చే వేసవి సీజన్ ముగిసే వరకు కూడా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి హాబిటేషన్ కు రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా ముందస్తుగానే సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామని అన్నారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంటకు సాగు నీరు అందించే పరిస్థితి లేనందున వరి వేయవద్దని రైతులకు హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యూ.ఎస్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, పశుగ్రాసం, యాసంగి పంటల సాగు, ఆర్ఓబీ ల నిర్మాణ పనుల పురోగతి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాల పనులు, నిజామాబాద్ కార్పొరేషన్ సహా బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ పట్టణాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను పూర్తిగా తాగు నీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకోవాలని కోరారు. ఆరుతడి పంటలకు కూడా అవసరం మేరకే సాగు నీరు వినియోగించుకునేందుకు వీలుగా రైతుల ప్రయోజనాల కోసం అన్ని మండలాలకు సబ్సిడీపై రెయిన్ గన్స్ మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. ఒక్కో యూనిట్ ధర 24 వేలు ఉండగా, అందులో 8 వేలు చెల్లిస్తే మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రాయితీ కింద భరిస్తుందని తెలిపారు. కాగా, మూగజీవాలకు కూడా పశుగ్రాసం కొరత, నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చోట నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని, పశుగ్రాసం విత్తనాలు సబ్సిడీపై అందించాలని అధికారులకు సూచించారు.

జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. అవసరమైన చోట పైప్ లైన్ల మరమ్మతులు చేపట్టి లీకేజీలు లేకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాకు ఉపయోగపడుతున్న చెరువులను పూర్తి స్థాయి నీటి నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా బోర్లు తవ్వించకుండా, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ పట్టణాలలో కొనసాగుతున్న మంచి నీటి ట్యాంకుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. అవసరమైతే కూలీల సంఖ్యను పెంచాలని అన్నారు. యంచ వద్ద గల న్యాల్కల్ పంప్ హౌజ్ ద్వారా నిర్దేశిత గ్రామాలకు రక్షిత మంచి నీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా చుక్క నీరు వృధా కాకూడదని, అదే సమయంలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

ఆర్.ఓ.బీ ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి ఇదిలాఉండగా, మాధవనగర్, అర్సపల్లి ప్రాంతాలలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాధవనగర్ ఆర్ఓబీ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 13 విడతలలో రూ. 42 కోట్ల నిధులు కేటాయించిందని వివరించారు. అర్సపల్లి ఆర్ఓబీ కి కూడా రూ. 11 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. అయినప్పటికీ కొంత మంది నాయకులు అవగాహన లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల సౌకర్యార్థం ఆర్ఓబీ ల నిర్మాణాలను నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు గడువు విధించారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎక్కడ కూడా నీటి వృధా జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, రక్షిత నీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు.

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ అధికారులు ప్రవీణ్, అరవింద్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు స్వప్న, రాకేష్, పబ్లిక్ హెల్త్ ఈ.ఈ తిరుపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనపూర్ మండలంలో రూ.1.49 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : నియోజకవర్గంలోని ఘనపూర్ మండలంలో పలు గ్రామాల్లో రూ.1.49 కోట్లతో చేపట్టనున్న మహిళా సమైక్య భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మారెడ్డి పల్లె, బుర్రకాయల గూడెం, చెల్పూర్ గ్రామాలలో మహిళా సమైక్య భవనం శంకుస్థాపనలు చేయడం జరిగింది. మరియు గాంధీనగ,ర్ ఘనపూర్,చెల్పూర్ గ్రామాలలో అంగన్వాడి భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవసరాలకు తగినటువంటి గ్రామపంచాయతీ భవనాలు మరియు అంగన్వాడి అలాగే గ్రామ సమైక్య భవనాలకు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పడం జరిగింది.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సమైక్య భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కట్టకు కష్టం.. బ్లాస్టింగ్‌లతో ముప్పు!

- మల్లన్నసాగర్ భద్రతపై బీఆర్ఎస్ బిగ్గర స్వరం
- తిప్పారం వద్ద పేలుళ్ల ప్రాంతాన్ని పరిశీలించిన హరీశ్ రావు

కుకునూరుపల్లి, అక్టోబర్ 29,విజన్ ఆంధ్ర : మల్లన్నసాగర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌లు కలకలం రేపుతున్నాయి. రిజర్వాయర్ భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామం వద్ద పైప్‌లైన్ల ఏర్పాటు కోసం అనధికారికంగా పేలుళ్లు జరుపుతున్నారన్న గ్రామస్తుల ఫిర్యాదుతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు గురువారం బీఆర్ఎస్ నేతల బృందంతో కలిసి పేలుళ్ల ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ కట్టకు కనీసం 400 మీటర్ల దూరంలో, అధికారుల అనుమతులతోనే బ్లాస్టింగ్‌లు జరపాల్సి ఉంటుందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే తిప్పారం వద్ద కట్టకు కేవలం 100 మీటర్ల పరిధిలోనే అనుమతులు లేకుండా పేలుళ్లు జరుపుతున్నారని ఆరోపించారు. స్థానిక సర్పంచ్ అభ్యంతరం తెలిపినా గత రెండు మూడు నెలలుగా ఈ వ్యవహారం కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేలుళ్ల ప్రభావంతో మల్లన్నసాగర్ కట్టకు బీటలు ఏర్పడ్డాయని, నీటి లీకేజీలు మొదలయ్యాయని, సమీపంలోని ఇళ్లకు సైతం నష్టం వాటిల్లుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేసినట్లు హరీశ్ రావు తెలిపారు. ఈ అంశంపై అధికారులను, పోలీసులను ప్రశ్నించినా సరైన స్పందన రావడం లేదని విమర్శించారు. మల్లన్నసాగర్ కట్ట భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. కాళేశ్వరం

ప్రాజెక్టును దెబ్బతీసే కుట్ర జరుగుతోందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బ్లాస్టింగ్‌లపై తక్షణ విచారణ జరిపి, కట్ట భద్రతను నిర్ధారించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, బక్కి వెంకటయ్య, స్థానిక సర్పంచ్ ఆకుల భద్రప్ప , తిప్పారం గ్రామస్తులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది మార్చి నాటికి శ్రీ కాళేశ్వరం ఆలయం పనులు పూర్తికావాలి..!

అష్టతీర్థాల ఘాట్ల నిర్మాణాన్ని 13 ఎకరాల భూసేకరణ పూర్తి..!

మరో 18 ఎకరాల భూసేకరణ కోసం గ్రామాల ప్రజలతో చర్చించండి..!

గోదావరి పుష్కరాల ఏర్పాట్లు భక్తులకు ఎలాంటి లోటు రాకూడదు..!

సంబంధిత అధికారు, కాంట్రాక్టులతో సమీక్ష సమావేశం..!

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్..!

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు,..!

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ...!

మహాదేవపూర్ అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులతో పాటు అష్టతీర్థాల ఘాట్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు. గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆమె కాళేశ్వరంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ప్రధాన ఆలయం, రామాలయం, జ్ఞానవాపి బావి, శుభానందిని అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. విజయ గణపతి ఆలయ నిర్మాణ ప్రాంతంలో కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతి ఘాట్‌ను సందర్శించి అష్టతీర్థాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, భూసేకరణ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోట్ జెట్టీ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ఆలయ పునర్నిర్మాణం, ఘాట్ల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ, కాళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయని, క్షేత్రస్థాయి పరిశీలనలో పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, మండపాల నిర్మాణ పనులు కూడా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల పురోగతికి కృషి చేస్తున్న ధార్మిక సలహాదారు, దేవాదాయ శాఖ కమిషనర్, కాంట్రాక్టర్లు, స్థపతులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. అయితే ప్రస్తుత పురోగతితో సంతృప్తి చెంది పనుల్లో వేగం తగ్గించరాదని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటే ప్రధాన ఆలయ నిర్మాణ పనులను మార్చి నాటికి పూర్తి చేయడం అత్యంత కీలకమని అన్నారు. అధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశిత గడువును తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అష్టతీర్థాల ఘాట్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని శైలజా రామయ్యర్ సూచించారు. ఘాట్లకు సంబంధించిన ఫౌండేషన్ డ్రాయింగ్‌లను త్వరితగతిన అందించాలని, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థలకు సంబంధించిన డిజైన్లను వెంటనే ఖరారు చేయాలని ఆదేశించారు. సివిల్ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అవసరమైన యంత్రాలను అందుబాటులో ఉంచడంతో పాటు కార్మికుల సంఖ్యను పెంచాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆలయ నిర్మాణ పనులపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని, జిల్లా కలెక్టర్ స్థాయిలోనూ నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. తాను ప్రతి నెలా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలిస్తానని వెల్లడించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. కాళేశ్వరాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీ పేర్కొన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనులకు సంబంధించిన డిజైన్లు, ప్రణాళికలను త్వరగా ఖరారు చేయాలని సూచించారు. రహదారుల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను పుష్కరాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఆలయ తలుపులు, ధ్వజస్తంభాలు, కలశాలకు బంగారు లేదా వెండి తాపడం చేయించేందుకు దాతలను గుర్తించి విరాళాలు సమీకరించాలని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన వసతులు కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో

పనిచేయాలని కోరారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.195 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అష్టతీర్థాల ఘాట్లు, రహదారులు తదితర అభివృద్ధి పనులకు కూడా నిధులు కేటాయించామని, వివిధ శాఖల సమన్వయంతో పనులను పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఘాట్ల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే 13 ఎకరాల భూసేకరణ పూర్తయిందని, మరో 18 ఎకరాల భూసేకరణ కోసం సంబంధిత గ్రామాల ప్రజలతో చర్చించి, నిబంధనల ప్రకారం పరిహారం అందించే చర్యలు చేపడతామని వివరించారు. అవసరమైన డ్రాయింగ్‌లు అందిన వెంటనే ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, అన్ని శాఖల పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, పర్యాటక శాఖ ప్రతినిధులు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో కుకునూరుపల్లి మండలానికి ఆరు బహుమతులు

- విద్యార్థుల ప్రతిభకు ఎంఈఓ బచ్చలి సత్తయ్య అభినందనలు

కుకునూరుపల్లి, అక్టోబర్ 29,విజన్ ఆంధ్ర : సిద్దిపేట జిల్లాలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సమగ్ర విద్యా క్రీడా పోటీల్లో కుకునూరుపల్లి మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు సత్తా చాటి ఆరు బహుమతులు సాధించారు. సాయి దేవాన్ష్ 100 మీటర్ల పరుగు పందెంలో, అక్షర రిత్విక్ స్పీడ్ వాక్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. ఈ పోటీల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పంజాల ప్రశాంత్ గౌడ్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులను మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య అభినందించారు. దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని పేర్కొంటూ, విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఎంఈఓ ఆకాంక్షించారు.

దేవి రవీందర్‌పై దాడి ఘటన.. వివరాలు తెలుసుకున్న హరీశ్ రావు

కుకునూరుపల్లి,అక్టోబర్ 29,విజన్ ఆంధ్ర : కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో మాజీ ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ నివాసానికి గురువారం వచ్చిన మాజీ మంత్రి హరీశ్ రావు.. ఇటీవలే కాంగ్రెస్ నాయకులు ఆయన పై చేసిన దాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి దారితీసిన పరిస్థితులు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై హరీష్ రావు ఆరా తీశారు.

ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సాధించాలి

మందమర్రి, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : బొగ్గు ఉత్పత్తి,రవాణా లక్ష్యాలను సాధించడంలో అధికారులు,సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని ఈ అండ్ ఏం, సి.హెచ్.పి కార్పొరేట్ జీఎం కే. శ్రీనివాసులు అన్నారు. గురువారం కేకే వన్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్,రైల్వే సైడింగ్ ను ఏరియా జిఎం రాధాకృష్ణతో కలిసి విస్తృతంగా పరిశీలించారు. పనులు సజావుగా సాగేలా అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. మందమర్రి ఏరియాకు వచ్చిన శ్రీనివాసులును ఏరియా జిఎం రాధాకృష్ణ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు.జి.ఎం లలిత్ ప్రసాద్, డిజిఎం ఈఅండ్ఏం బాలాజీ భగవతి ఝా,డిజిఎం కార్పొరేట్ కరిముల్లా,ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు,డిజియం పర్సనల్ అశోక్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ రేషన్ కార్డులు: మేయర్ దర్ని మధుకర్

నస్పూర్(మంచిర్యాల), అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): అర్హులైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 2, 10వ డివిజన్లలో నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఫలాలు పేదలకు చేరడంలో తెల్ల రేషన్ కార్డు అత్యంత కీలకమైనదని, ఆధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ కార్డుల ద్వారా అర్హులకు మరింత పారదర్శకంగా సేవలు అందుతాయని వివరించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గారి నాయకత్వంలో నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు నిరాటంకంగా అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు రాచకొండ గోపాల్ రావు, ఎండీ ఖలీద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో భయాంకరణ వాతావరణం రాబోతుంది

- గతంలో కరోనా , ప్రస్తుతం ఎల్ నినో

జన్నారం, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో భయాంకరణ వాతావరణం రాబోతుందని గతంలో కరోనాతో పెద్ద గండం వస్తే ప్రస్తుతం ఎల్ నినోతో ముప్పు రాబోతుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం రోజున జన్నారం మండలకేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయ సమావేశంలో మందిరంలో నిర్వహిం చిన మండల సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన కు ఇప్పుడు ఎలాంటి సమస్యలు లేనప్పటికీ ముం దు ముందు మన రాష్ట్రంలో ఎల్ నినో ము ప్పు రాబోతుందని తెలిపారు. పుష్కలంగా వర్షాలు ప డ్డప్పుడే మనకు నీటి సమస్య ఉండేది. అలాంటిది ఇప్పుడు ఎల్ నినో మూలంగా రాష్ట్రంలో వర్షాలు తక్కువగా పడి భూగర్భ జలాలు అడగండి పోయే ప్రమాదం ఉందని అంతే కాకుండా పంటలు సక్ర మంగా పండక కరువు పరిస్థితులు తలెత్తే అవకా శాలు వున్నాయని రైతులు త క్కువ నీరు అవసర మయ్యే పంటలను వేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతల నిర్మా ణాలు ఏర్పాటు చేసుకోని నీటిని వృధా చేయకుం డా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గ్రా మాలలో సర్పంచులు, వార్డు సభ్యులు అధికారు లు కలిసి ఎల్ నినో ప్రభావం గురించి ప్రజలకు అవ గాహన కల్పిం చాలని తెలిపారు. అనంతరం పలు వురు సర్పంచులు వారి వారి గ్రామాల సమస్యల ను ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో ఆయన వా టిని పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ,తహసీల్దార్, బక్కయ్య, ఎంపిడిఓ ఉమర్ షరీఫ్, పోనకల్ పిఏసీఎస్ చైర్మన్ అల్లం రవి,వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణి

- విద్యార్థులకు డ్రెస్సులు అందజేయడం అభినందనీయం

- ఎర్రవల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం

మర్కుక్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : మర్కుక్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో జయకుమార్ జె కె ఎస్ సూర్య ఫామ్ ఎర్రవల్లి వారి సహకారంతో గురువారం నాడు ఎర్రవల్లి లో గల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం లను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు డ్రెస్సులు అందజేయడం ఎంతో అభినందనీయమని,విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత రామ్మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సబితా కరుణాకర్, వార్డు సభ్యులు, ప్యాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు, మాజీ సర్పంచ్ భాగ్య బిక్షపతి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్ రెడ్డి,ఉపాధ్యాయులు విజయ, రామకృష్ణా రెడ్డి, కనకరావు, సువర్ణ, అన్నపూర్ణ, ఉమామహేశ్వర్ రెడ్డి, కవిత, శ్రావణి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి వృధాను అరికట్టాలి

రామకృష్ణాపూర్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : ఎల్.ని.నో ప్రభావంతో నీటి,విద్యుత్ కొరత ఏర్పడనున్న నేపథ్యంలో క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో నీటి వృధాను అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ మురళి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించి పొదుపుగా వినియోగించాలని ఆయన సూచించారు. పుర ప్రజలు నీటి,విద్యుత్ పొదుపులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులపై కమిషనర్ క్షేత్రస్థాయి సమీక్ష

- వరద కాలువ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి
- రోడ్డు విస్తరణకు విద్యుత్ స్తంభాల తరలింపు వేగవంతం
- ఆక్రమణలు తొలగించి సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): గాజులరామారం సర్కిల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆమె.. పనుల పురోగతిని సమీక్షించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మల్లారెడ్డి ఆస్పత్రి నుంచి పెద్ద చెరువు వరకు నిర్మిస్తున్న వరద నీటి కాలువ పనులను పరిశీలించి, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. గాజులరామారం జంక్షన్ నుంచి మహాదేవపురం జంక్షన్ వరకు ప్రతిపాదించిన రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను త్వరగా తరలించి, వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మహాదేవపురం జంక్షన్ నుంచి సిక్కు బస్తీ వరకు నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కమిషనర్.. రోడ్డు మార్గంలోని ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని, అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ యు. వెంకట్ రాములు, ఈఈ గోవర్ధన్ గౌడ్, డిప్యూటీ ఈఈ నిఖిల్ రెడ్డి, ఏసీపీ సుమిత్ర, డిప్యూటీ ఈఈ మహదేవ్ అనురాగ్, ఎలక్ట్రికల్ డిప్యూటీ ఈఈ లావణ్య, యూబీడీ మేనేజర్ విజయరాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాయపర్తి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- జాతీయ రహదారిపై బైఠాయించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి
- బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష

రాయపర్తి, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం రాయపర్తి మండల కేంద్రంలో ఆయన విస్తృతంగా పర్యటించారు.ఎర్రబెల్లితో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఉన్నారు.వరంగల్ -ఖమ్మం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు,స్థానిక నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు.రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.దీంతో కిలోమీటర్ మేర వాహనాలు స్తంభించిపోయాయి.ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ... వరంగల్ జిల్లాలోని వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతాంగం తీవ్ర నిరాశలో కూరుకుపోయిందని మండిపడ్డారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి రాయపర్తి మండలంతో పాటు వరంగల్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ప్రభుత్వంపై పోరాటాని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై సమీక్ష..

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నాయకులు,కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఎర్రబెల్లితో కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడారు.గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును పక్కా ప్రణాళికతో పూర్తిచేయాలని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరి చేత ఓటు నమోదు చేయించే బాధ్యతను నాయకులు తీసుకోవాలని కోరారు.కాంగ్రెస్ పాలనలలో నిరుద్యోగులకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ నవంబర్ 6వ తేదీ లోగా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు.అనంతరం మండల నాయకులు తహసిల్దారు ముల్కనూరి శ్రీనివాస్ కు రాయపర్తిని కరువు మండలంగా ప్రకటించాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు,సర్పంచులు,రైతులు పాల్గొన్నారు.

కళ్లెం అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా శ్రీమంతం కార్యక్రమం

గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిరక్షణకు ఐసీడీఎస్ శాఖ ప్రత్యేక శ్రద్ధ

లింగాల గణపురం అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : జనగామ జిల్లా లింగాల గణపురం మండలం కళ్లెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం--1లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హంసమ్మ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీ కొత్తపేట వెన్నెలకు శ్రీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి, మాతృత్వాన్ని గౌరవించే కార్యక్రమాన్ని చేపట్టారు. గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా మిషన్ శక్తి ప్రతినిధి హేమలత, అంగన్వాడీ టీచర్లు రేణుక, గౌసియా బేగం, గర్భిణీ స్త్రీలు, తల్లులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసరాలను వినియోగించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రేకులగూడలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను మండల పంచాయతీ అధికారి సబ్దర్ అలీతో కలిసి సందర్శించి, పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలించారు.

తాండూర్ మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న డి.ఎ. జుగా వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, నూతనంగా నిర్మిస్తున్న భోజనశాల పనులను పరిశీలించారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వంటశాలను తనిఖీ చేసి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన సందర్భంగా, విద్యార్థులకు సరైన విద్యా వాతావరణం కల్పించడంలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించి, సంబంధిత స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

అనంతరం బెల్లంపల్లిలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి నియోజకవర్గ పరిధిలోని తహసిల్దార్లతో సమావేశం నిర్వహించారు. భూభారతి, భూదాన్ భూములు, రెవెన్యూ సంబంధిత అంశాలు తదితర అంశాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, రెవెన్యూ సమస్యలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని, చేపట్టిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ ఐ ఆర్ పై విద్యారులతో ఎంపీ రఘునందన్ రావు ముఖాముఖీ

నర్సాపూర్, అక్టోబర్ 29:(విజన్ ఆంధ్ర ప్రతినిధి) నర్సాపూర్ లో ఎస్ ఐ ఆర్ పై నిర్వహించిన ముఖాముఖీ చర్చకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పాల్గొని విద్యార్థులకు ఎస్ఐఆర్ పై అవగాహన కలిగించారు, అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డెంటల్ క్లినిక్ ను ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ సంఘసని సురేష్ , రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్ , కవిత ,దిశా కమిటీ మెంబర్స్ రమేష్ గౌడ్ , పద్మ , జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్ , జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్ , బీజేపీ నర్సాపూర్ పట్టణ కన్వీనర్ ప్రేమ్ కుమార్ యాదవ్ , మండల అధ్యక్షులు నాగ ప్రభు , దాసుగారు, నగేశ్ ,బీజేపీ సీనియర్ నాయకులు,వివిధ మోర్చా అధ్యక్షులు శక్తి కింద ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు...లి

ఆర్ఓబీ పై బీజేపీ, కాంగ్రెస్ లు డ్రామాలాడుతున్నాయి.

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ అక్టోబర్ 29:(విజన్ ఆంధ్ర) : మాధవ నగర్ రైల్వే బ్రిడ్జి పై బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు డ్రామాలాడుతున్నాయని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే బ్రిడ్జి అసంపూర్తిగా మిగిలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను పక్కన పెట్టి తమ రాజకీయ లబ్ధి కోసం ధర్నాలు, దీక్షల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులే ఇప్పటివరకు ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైల్వే బ్రిడ్జిలను నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నరేంద్ర మోదీ ఇద్దరు మంచి స్నేహితులే కదా రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఎందుకు సాధించడం లేదని ఆయన ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్రం నుంచి బీజేపీ కి 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడడానికి కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత పాలనే కారణమన్నారు. రైతులు ఎంతో గోస పడుతుంటే కాంగ్రెస్, బీజేపీ లు పట్టించుకోకుండా ప్రజలను మభ్య పెట్టడానికి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ పబ్బం గడుపు కుంటున్నారన్నారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అయితే, బీజేపీది హిందుత్వ పాఠాన్ని ఇద్దరు కలిసి ఢిల్లీలో చట్టపట్టలేసుకొని తిరుగుతున్నారని ఆరోపించారు. వరి సాగు చేయవద్దని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పంటలు పండించకుంటే జనం ఆకలితో అలమటిస్తారని, ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియకపోవడం కాంగ్రెస్ పార్టీ అసమర్థత పాలనకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంత మాత్రం పట్టించుకోవడంలేదని, కేవలం పొద్దున లేస్తే,కేసీఆర్, కేటీఆర్ ను తిట్టడమే వారి దినచర్యలో భాగంగా మారిందని బాజిరెడ్డి గోవర్ధన్ దుయ్యబట్టారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బొజ్జు పటేల్.

జన్నారం, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నా రు. గురువారం రోజున జన్నారం మండలకేంద్రంలో ని రైతువేదికలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాధి ముబారక్, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదా రులకు చెక్కులను, రేషన్ కార్డులను అందజేశారు .అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల సంక్షేమా నికి పెద్దపీట వేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికీ సం క్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాధి ముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడ బిడ్డల పెళ్లి ఖర్చుల భారం తగ్గిందని అన్నారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పథకాలు నేరుగా లబ్ధిదారుల కు చేరుతున్నాయని అన్నారు. ఎల్ నినో ప్రభావం మూలంగా నీటి కష్టాలు వచ్చే అవకాశం ఉందని మహిళలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చై ర్మన్ వైస్ చైర్మన్లు లక్ష్మీ నారాయణ, సయ్యద్ ఫసి ఉల్లా, తహసీల్దార్ బక్కయ్య, కాంగ్రెస్ పార్టీ మండ ల అధ్యక్షుడు నందు నాయక్, పోనకల్ మాజీ స ర్పంచ్ జక్కు భూమేష్, పిఏ సీఎస్ చైర్మన్ అల్లం రవి, జిల్లా నాయకులు ముజాఫర్, మండల కార్య దర్శి మాణిక్యం, మచ్చ శంకరయ్య, హాజర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

13 తులాల వెండి వస్తువులు స్వాధీనం

బెల్లంపల్లి, అక్టోబరు 29(విజన్ ఆంధ్ర): ఇంటి తాళాలు పగలగొట్టి వెండి ఆభరణాలు, నగదు చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి సుమారు 13 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ కె. శ్రీనివాసరావు తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.

తాళాలు పగలగొట్టి చోరీ

పోలీసుల వివరాల ప్రకారం.. కాంట్రాక్టర్ బస్తీకి చెందిన కొత్తపల్లి అర్జున్ ఈ నెల 23న కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి పక్కింటి వ్యక్తికి సమాచారం ఇచ్చాడు. ఈ నెల 27న ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన పక్కింటి వ్యక్తి అర్జున్‌కు సమాచారమిచ్చాడు. ఇంటికి చేరుకున్న ఆయన బీరువాలోని వెండి చేతి కడియం, కాళ్ల పట్టీలు, రూ.3 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన వెండి వస్తువుల విలువ సుమారు రూ.6,500గా అంచనా వేశారు.

తనిఖీల్లో పట్టివేత

ఈ నెల 29న పోచమ్మ చెరువు కట్ట వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పోలీసులు విచారించారు. వారి వద్ద నుంచి చోరీకి గురైనట్లు గుర్తించిన వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. యూనస్ షేక్, ఎండీ గౌస్ బాబాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు దాసరి కళ్యాణ్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌ఓ సూచించారు. ఇరుగుపొరుగు వారు ఖాళీగా ఉన్న ఇళ్లపై నిఘా ఉంచాలని, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కేసు దర్యాప్తు చేసిన ఎస్ఐ రామకృష్ణ, సహకరించిన సిబ్బందిని అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చేగుంట అక్టోబర్ 30 విజన్ ఆంధ్ర : పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంటలో స్పోర్ట్స్ మీట్ ను జ్యోతి వెలిగించి ప్రారంభించిన మండల విద్యాధికారి నీరజ మరియు గ్రామ సర్పంచ్ స్రవంతి

ఈ సందర్భంగా మండల విద్యాధికారి నీరజ మాట్లాడుతూ, ఆటలో శారీరక మానసిక వికాసానికి తోడ్పడతాయని ఆటల వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, క్రమశిక్షణ అలవడుతుందని, అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలని, ఆటలతో ఆత్మవిశ్వాసం, ఐక్యమత్యం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పిడి శారదా మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో మరియు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానోత్సవం చేయడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం రాజేశ్వర్, ఉపాధ్యాయులు రఘుపతి సుధాకర్ రెడ్డి, రాధా, రమ సరస్వతి, రావుల వెంకటేష్, గర్దాస్ మనోహర్‌రావు, శ్రీనివాస్ గౌడ్, ఉమాదేవి, ఉమామహేశ్వరి సి ఆర్ పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి రక్షణ కవచం!

- యానిమల్ కేర్ సెంటర్‌లో వెటర్నరీ శాఖ స్థల హద్దుల గుర్తింపు
- ఆక్రమణలకు తావులేకుండా బౌండరీ వాల్ నిర్మాణానికి అధికారుల ఆదేశాలు
- భూమి పరిరక్షణలో సమన్వయంతో ముందుకు సాగాలని స్పష్టీకరణ

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): మహాదేవపురంలోని యానిమల్ కేర్ సెంటర్ (జంతు సంరక్షణ కేంద్రం) వద్ద వెటర్నరీ విభాగానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కేటాయించిన భూమి హద్దుల గుర్తింపు ప్రక్రియను మండల సర్వేయర్‌తో కలిసి పరిశీలించిన జోనల్ కమిషనర్.. ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురికాకుండా తక్షణమే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భూమి డిమార్కేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేటాయించిన స్థలం యొక్క సరిహద్దులను స్పష్టంగా గుర్తించాలని సూచించారు. భూమి హద్దుల నిర్ధారణ అనంతరం ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పించేలా బౌండరీ వాల్ నిర్మాణాన్ని ఖరారు చేసి, పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతోపాటు, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జోనల్ కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ వెంకట్రాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోవర్ధన్, మండల సర్వేయర్ జ్యోతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎస్‌డబ్ల్యూఎం) నిఖిల్ రెడ్డి, ఏసీపీ సుమిత్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఇంజినీరింగ్) మహదేవ్ అనురాగ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలో టపాసుల అక్రమ నిల్వ!

- 100 కిలోల బాణసంచా స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

బోడుప్పల్, అక్టోబరు 29(విజన్ ఆంధ్ర ప్రతినిధి) :నివాస ప్రాంతంలో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా భారీ మొత్తంలో బాణసంచా నిల్వ ఉంచిన ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.
పోలీసుల వివరాల ప్రకారం..కాచవాని సింగారంలోని జయశంకర్ విగ్రహం సమీపంలో టపాసులు అక్రమంగా నిల్వ ఉంచినట్లు గురువారం ఉదయం 8 గంటల సమయంలో సమాచారం అందింది. దీంతో పోలీసు సిబ్బంది, పంచ సాక్షులతో కలిసి అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 58 పెట్టెలు,ఇతర ప్యాకెట్లలో సుమారు 100 కిలోల టపాసులను భద్రతా చర్యలు పాటించకుండా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి కాచవాని సింగారం జయశంకర్ విగ్రహం సమీపంలో నివసించే ఏలగందుల స్వామి (31), ఉప్పల్‌లోని దేవేందర్ నగర్ కాలనీకి చెందిన జక్కుల శ్రీనివాస్ (36)లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పంచనామా నిర్వహించి టపాసులను స్వాధీనం చేసుకుని, తదుపరి

చట్టపరమైన చర్యల నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నివాస ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేయడం ప్రమాదకరమని పోలీసులు హెచ్చరించారు. అగ్నిప్రమాదాలు, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమానాస్పదంగా టపాసుల నిల్వలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ కరువు రాష్ట్రంగా మారింది

మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్‌లోని డైట్ మైదానంలో నవంబర్ 1న నిర్వహించనున్న 'రైతు గర్జన' సభకు గురువారం భూమిపూజ నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బాల్క సుమన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తదితరులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బాల్క సుమన్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని కరువు పరిస్థితుల్లోకి నెట్టారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో అమలైన రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టులతో వ్యవసాయం కళకళలాడిందని, ప్రస్తుతం రైతులు సాగునీరు, పెట్టుబడి సాయం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుబంధు, రైతుబీమా అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ సభ వేదిక కానుందని తెలిపారు. జిల్లాను గులాబీమయం చేసేలా ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. మాజీ మంత్రి జోగు రామన్న

మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రైతులకు అన్ని విధాలుగా ఆర్థిక భరోసా కల్పించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ఆరు గ్యారంటీల అమలు తీరును ఎండగట్టేందుకే ఈ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. నవంబర్ 1న సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ రైతు గర్జన సభకు రైతులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భార్గవ్ దేశ్‌పాండేతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిధుల ఘనత మాదంటే సరిపోదు బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ కృషితోనే వంతెనల నిర్మాణానికి రూ.14.30 కోట్ల నిధులు మంజూరు

భిక్కనూర్ అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర వార్షిక తనిఖీలో భాగంగా భిక్కూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో సుదీర్ఘంగా మాట్లాడి, వారు నిర్వహిస్తున్న విధులు, అనుసరిస్తున్న విధానాలు, విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భిక్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల తీరు, అనుమానిత వ్యక్తులు, రౌడీషీటర్ల వివరాలు, వారి కదలికలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కేసు ఫైళు ,, వివిధ రికార్డుల నిర్వహణను పరిశీలించి, వాటిని ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. రోల్‌కాల్‌ను పరిశీలించి, టెలికాన్ఫ్రెండ్స్ ద్వారా సిబ్బందికి అందిస్తున్న సమాచారం, సూచనలు సక్రమంగా చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను ఓపికగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి, దర్యాప్తులో జాప్యం జరగకుండా అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించాలని తెలిపారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ కేసుల

దర్యాప్తును పకడ్బందీగా పూర్తి చేసి, నిర్ణీత గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు. రాత్రి వేళల్లో గస్తీని పటిష్టం చేసి దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వారి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోని కేసు ఫైళ్లు, కేసు డైరీలు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, ఇతర ముఖ్యమైన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు నవీకరించాలని ఎస్పీ సూచించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, సూచించారు. ఈ వార్షిక తనిఖీలో కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, భిక్కనూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. నరేష్, భిక్కూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ అనిల్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాలపల్లి పాఠశాలలో షూ, బెల్టులు, ఆట వస్తువుల పంపిణీ

హుస్నాబాద్ విజన్అ ఆంధ్ర క్టోబరు 29 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాల సాధనకు ప్రభుత్వం కృషి చేస్తోందని మాలపల్లి సర్పంచ్ వెన్న స్వర్ణలత అన్నారు. హుస్నాబాద్ మండలం మాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు షూ, బెల్టులు పంపిణీ చేయడంతో పాటు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమంతో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతోందన్నారు. చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బత్తుల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెన్న రాజు, పాలకవర్గ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు సతీష్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పశువుల త్రాగునీటి కొరకు పశువుల తొట్టి నిర్మాణం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర విజన్ ఆంధ్ర అక్టోబర్ 29 : తెలంగాణ రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి సీతక్క సూచనతో ఎల్ నివో దృష్టిలో పెట్టుకొని పశువుల సంరక్షణ కొరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలకు గురువారం రోజున సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో తోటపల్లి గ్రామంలో పశువుల నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పశువులకు త్రాగునీరు కొరకు అందుబాటులో ఉండేవిధంగా నీటి తొట్టెలు నిర్మించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, మండల అభివృద్ధి అధికారి సురేష్,ఏపీఓ పద్మ, ఈసీ అండ్ టెక్నికల్ అసిస్టెంట్ పరశురాం, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్స్ వార్డ్ మెంబర్స్ గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట మండలాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలి

బీజేపీ అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి డిమాండ్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 29 : సిద్దిపేట అక్కన్నపేట మండలాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీజేపీ అక్కన్నపేట మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను ప్రభుత్వం గుర్తించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రామంచ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ,వర్షాభావ పరిస్థితులు, పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదో తెలియని పరిస్థితి నెలకొందని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్కన్నపేట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.అక్కన్నపేట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు న్యాయం చేయలేకపోతే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అక్కన్నపేట మండలాన్ని కరువు మండలముగా ప్రకటించాలని తహసీల్దార్ కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు నునావత్ మోహన్ నాయక్,గుగులోత్ తిరుపతి నాయక్, గుగులోత్ లకపతి,చెరుకు సంపత్, మడక రవికుమార్ అర్జున్ నాయక్, సంక్రీ సంతోష్,కళ్యాణ్ విష్ణు, సమిరెడ్డి, సలేంద్ర తిరుపతి, గంగుల కుమార్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు అమృత్ పథకం ద్వారా ప్రత్యేక చర్యలు

-ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా అమృత్ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల వద్ద అమృత్ పథకంలో భాగంగా చేపడుతున్న ఇంకుడు గుంత నిర్మాణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో రూ.50 లక్షల వ్యయంతో 10 ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను సమర్థవంతంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే చెరువులు కలుషితం కాకుండా నివారించేందుకు, మురుగునీటిని శుద్ధి చేసే వ్యవస్థల ఏర్పాటుకు తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి నీటి కొరత ఏర్పడకుండా అమృత్ పథకం కింద ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల నిర్మాణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులను చేపడుతోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. అధికారులు పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

గీతా కార్మికుల సమస్యలపై ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం

- బుర్ర శ్రీనివాస్ గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 29 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని డివిజన్ స్థాయి ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపేద గౌడ కులస్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎన్నిసార్లు ఎక్సైజ్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ఎక్సైజ్ సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి గౌడ కులస్తులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం రోజున ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులకు సమస్యలు విన్నవించేందుకు వెళ్లగా అక్కడ ఎక్సైజ్ సిబ్బంది నిర్లక్ష్యమైన సమాధానం ఇవ్వడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హుస్నాబాద్ ఎక్సైజ్ పరిధిలోని కోహెడ మండలంలో వర్కోల్ గ్రామానికి చెందిన వెల్డి పరశరములు గౌడ్ నాలుగు సంవత్సరాల క్రితం తాటి చెట్టునుండి పడి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు చూస్తున్న అధికారుల చుట్టూ తిరిగిన పట్టించుకోవడం లేదని,ఇదే ఎక్సైజ్ అధికారులు శ్రీనివాస్ మూర్తి ఎక్సైజ్ సూపరిండెంట్ ఉన్నప్పుడు ఇతనిని సిబ్బందిని ఇచ్చి గవర్నమెంట్ హాస్పిటల్ కు పంపి టెస్టు చేసి హాస్పిటల్ నుండి సర్టిఫికెట్ తీసుకొని ఇచ్చిన ఇంతవరకు సాయం అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వాళ్లకి అడిగిన పత్రాలు అన్ని సమర్పించిన ఇంతవరకు ఎక్స్రేషియా అందలేదని అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల సామాన్యుడు బలవుతున్నాడని, గీత కార్మికులకు పెన్షన్ కోసం వచ్చిన అప్రూవల్ లిస్ట్ మరొక్కసారి వెరిఫికేషన్ అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు గీతా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా తొర్రూర్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

మహబూబాబాద్ బ్యూరో అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర) : తొర్రూర్ పట్టణం లో మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణ కిషోర్ సిఐ గణేష్ ఎస్సై మహేందర్ రెడ్డి, ఖాదర్ బాషా తదితరులు ఉన్నారు.

వరి పంటలో కత్తెర పురుగు ఉధృతి

మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబరు 29 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని మహమ్మదాపూర్ గ్రామంలో వరి పంటను కత్తెర పురుగు ఆశించినట్లు మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజా, వ్యవసాయ విస్తరణ అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా గురువారం రోజున రైతులు స్వామి, పిట్టల బాలయ్య, కాసర్ల ఐలయ్య ల వరి పొలాలను సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. కత్తెర పురుగు రాత్రివేళల్లో వరి మొక్కల కాండాలను నేలమట్టానికి దగ్గరగా కత్తిరించి నష్టం కలిగిస్తుందని తెలిపారు. రైతులు సాయంత్రం, రాత్రి వేళల్లో పొలాలను పరిశీలించి పురుగులను ఏరివేసి నాశనం చేయాలని, పొలం గట్లపై గడ్డి, కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. పురుగు ఉధృతిని బట్టి వ్యవసాయ అధికారుల సలహా మేరకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావిత కరువు ప్రాంతంగా దౌల్తాబాద్‌ను ప్రకటించాలి

- వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- పంటల పరిస్థితిని పరిశీలించి పరిహారం అందించాలి

దౌల్తాబాద్,అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దౌల్తాబాద్ మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని బీజేపీ సీనియర్ నాయకుడు సర్వుగారి భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు వాతావరణ పరిస్థితుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి వారికి అండగా నిలవాలని కోరారు. మండలంలో పంటల సాగు, వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, పంటల ప్రస్తుత పరిస్థితిపై అధికారులు సమగ్రంగా పరిశీలన జరపాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలకు నష్టం వాటిల్లిన రైతులను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి వర్షాలు కీలకమని, సరైన సమయంలో వర్షాలు కురవకపోతే రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదోననే ఆందోళనకు గురవుతారని భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగు ఖర్చుల కోసం రైతులు అప్పులు చేయాల్సి వస్తోందని, పంటలు ఆశించిన స్థాయిలో పండకపోతే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని అంచనా వేయాలని కోరారు. వర్షాభావంతో దెబ్బతిన్న పంటలను గుర్తించి, సంబంధిత నివేదికలను ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. రైతులకు అవసరమైన సలహాలు, సాగునీటి సదుపాయాలు, ఇతర సహాయక చర్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు.

దౌల్తాబాద్ మండలంలో నెలకొన్న పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని భూపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతులకు పంట నష్టపరిహారం, అర్హత మేరకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పరామర్శిం చారు. జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామాని కి చెందిన గుండ శంకరయ్య, రేండ్లగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లం వెంకటరా జం తండ్రీ అల్లం రాజలింగం ఇటీవల మృతి చెంద డంతో గురువారం రోజున ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు ప్ర గాఢ సానుభూతి తెలియజేసి, వారికి ధైర్యం చె ప్పారు. అదేవిధంగా ముర్రిగూడ గ్రామానికి చెందిన మువారి చంద్రమోహన్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ను సైతం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి వివరా లు తెలుసుకొని 10 వేల రూపాయల ఆర్థిక సహా యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో

ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీ నారా యణ, పోనకల్ పిఏ సీఎస్ చైర్మన్ అల్లం రవి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు అజ్మీరా నందు నాయక్, మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు ఇసాక్, మచ్చ శంకరయ్య, తదితరులు ఉన్నారు.

ఏండ్లు గడుస్తున్నా కదలని ఇండ్ల స్థలాల జర్నలిస్ట్ ఫైలు

- అర్హులైన జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- ప్రభుత్వానికి జర్నలిస్ట్ సంఘాల వినతి

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 29 : ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంటి స్థలాలు కేటాయించాలి: జర్నలిస్టు సంఘాల డిమాండ్. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, అక్టోబ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో అర్హులైన జర్నలిస్ట్ లకు స్వంత ఇండ్లు లేక ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో నివసిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుల పరిస్థితి ఇప్పుడు పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రభుత్వాలుజర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని హామీలు ఇచ్చినా, సంబంధిత కార్యాచరణ ముందుకు సాగకపోవడంపై జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది హుస్నాబాద్‌లో అర్హులైన, నిరుపేద, ఇల్లు లేని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలనే డిమాండ్‌పై గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు సమర్పించారు. ఈ అంశానికి సంబంధించి సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కూడా చర్యల కోసం లేఖలు జారీ అయినట్లు జర్నలిస్టు వర్గాలు పేర్కొంటున్నాయి. జర్నలిస్టుల కోసం ఎకరం 20 గుంటల భూమి అందుబాటులో ఉ న్నట్లు గతంలో ప్రతిపాదనలు చేసినట్లు జర్నలిస్టు వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఇంతకాలం గడిచినా అర్హులైన జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు ప్రక్రియ పూర్తికాకపోవడంపై ప్రశ్నలు

వ్యక్తమవుతున్నాయి. జర్నలిస్ట్ స్థలాలపై తుది నిర్ణయం తీసుకోవాలి జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని కేవలం హామీలకే పరిమితం చేయకుండా, ఇప్పటివరకు జరిగిన కార్యాచరణను సమీక్షించి తుది నిర్ణయం తీసుకోవాలని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు మంత్రి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ లు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులను పరిశీలించి, స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను వేగవంతం చేయాలని, ఫైలు ఏ దశలో ఉందో స్పష్టం చేయడంతో పాటు, కేటాయింపులకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని కోరారు.

ఐక్య పోరాటమే పరిష్కార మార్గమా?

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అన్ని సంఘాలు, ప్రెస్‌క్లబ్‌లు, డిజిటల్ మీడియా ప్రతినిధులు ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి, ఇంటి స్థలాల అంశాన్ని ఉమ్మడి సమస్యగా తీసుకొని అధికారులపై చట్టబద్ధమైన, ప్రజాస్వామ్యబద్ధమైన ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు వినతులు సమర్పించిన నేపథ్యంలో, మరోసారి హామీ ఇచ్చి వాయిదా వేయకుండా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని జర్నలిస్టులు కోరుతున్నారు. అవసరమైతే సంబంధిత అధికారులను కలిసి తదుపరి కార్యాచరణను ప్రకటించేందుకు సిద్ధం కావాలని హుస్నాబాద్ జర్నలిస్ట్ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లో మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని 71 ప్రాంతాల్లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను గుర్తించి, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ప్రతి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో చేపట్టాల్సిన పనులు, వాటి పురోగతిని సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మౌలిక సదుపాయాలన్నీ కల్పించిన అనంతరం ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, ఆ శాఖ డిప్యూటీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు సిద్ధార్థ విద్యాలయం విద్యార్థుల ఎంపిక

-అండర్--14, అండర్--17 విభాగాల్లో ఏడుగురు విద్యార్థులకు చోటు

భిక్కనూరు, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): పాఠశాల క్రీడా రంగంలో సిద్ధార్థ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. భిక్కనూరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి నిర్వహించిన ఎంపికల్లో సిద్ధార్థ విద్యాలయానికి చెందిన ఏడుగురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్--14, అండర్--17 వాలీబాల్ జట్లకు ఎంపికయ్యారు.

అండర్--14 బాలుర విభాగంలో ఏడో తరగతి విద్యార్థి నీల మణిదీప్ ఎంపిక కాగా, బాలికల విభాగంలో తిరుపరి చందన, కేతి వేదశ్రీ చోటు దక్కించుకున్నారు. అలాగే అండర్--17 బాలుర విభాగంలో పదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ గౌడ్ ఎంపికయ్యాడు. బాలికల విభాగంలో టి. అనూష, పి. శ్రీచందన, ఏ. రిషిత ఎంపికై పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు.

ఒకే పాఠశాల నుంచి రెండు వయో విభాగాల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ బండి సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు లింగాల శ్రీకాంత్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందిస్తూ వారి విజయానికి కృషి చేసిన శారీరక విద్యా ఉపాధ్యాయుడు బీరయ్యను ప్రత్యేకంగా ప్రశంసించారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయండి

చేర్చాలనే సంకల్పంతోనే గతేడాది “తెలంగాణ రైజింగ్” విజన్ కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా అమలు చేస్తున్న విధానాలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకున్న అనుకూలతలను వివరించి పారిశ్రామికవేత్తలను “రైజింగ్ తెలంగాణ” విజన్ లో భాగస్వామ్యం చేసేందుకే ఢిల్లీలో “ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026” కర్టెన్ రైజర్ ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ 2.౦ లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నివారణకు అధికారులు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, కళాశాలల ప్రతినిధులు సమష్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారం సేకరించి, వాటి నివారణకు క్రియాశీలక చర్యలు చేపట్టాలని అన్నారు.

గురువారం జిల్లా కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నివారణపై జిల్లా అధికారులు, కళాశాలల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు చేపడుతున్న చర్యలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావం, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, చట్టపరమైన పరిణామాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. అన్ని కళాశాలల్లో మాదకద్రవ్యాల నివారణకు సంబంధించిన పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడినట్లు లేదా వాటి విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా వైద్య, ఇంజినీరింగ్, విశ్వవిద్యాలయాలు, ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ప్రవేశ సమయంలో నిర్వహించే పరిచయ కార్యక్రమాల్లోనే మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన 24 కేసులు నమోదు చేసి, 32 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించి పోలీసులకు సమాచారం అందించడంలో కళాశాలల యాజమాన్యాలు, ప్రతినిధులు మరింత చొరవ చూపాలని కోరారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నట్లు తెలిసినా, వాటి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

కళాశాలల పేరుప్రతిష్ఠలకు భంగం కలగకుండా, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు విద్యాసంస్థల ప్రతినిధులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే సంబంధిత విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, వ్యసన విముక్తి కేంద్రాలకు పంపించి చికిత్స, కౌన్సెలింగ్ అందించే చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, మరికొన్ని కేసుల్లో తదుపరి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గంజాయితో పాటు వైట్‌నర్, దగ్గు మందుల సిరప్‌లు, ఫెవికాల్ వంటి పదార్థాలను దుర్వినియోగం చేసే అవకాశాలపైనా విద్యాసంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. కొన్ని పదార్థాల దుర్వినియోగాన్ని సాధారణ మాదకద్రవ్య పరీక్షల ద్వారా గుర్తించడం కష్టమవుతుందని, అందువల్ల విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను అధ్యాపకులు, వార్డెన్లు గమనించాలని అన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కళాశాలల ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటికే తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసు, వైద్య, సంబంధిత శాఖల సహకారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రోత్సహించే వ్యక్తులు, విద్యాసంస్థల పరిసరాల్లో అనుమానాస్పదంగా కార్యకలాపాలు నిర్వహించే దుకాణాలు, ఇతర వనరులపై నిఘా పెట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, కళాశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలకు సంబంధించిన సమాచారం సేకరించి పోలీసులకు అందించాలని సూచించారు. విద్యార్థులు ఎక్కువ సమయం కళాశాలలు, వసతి గృహాల్లో గడుపుతున్నందున అధ్యాపకులు వారి ప్రవర్తనను నిశితంగా గమనించాలని అన్నారు. విద్యార్థులు తమ పిల్లలేననే భావనతో వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, పోలీసు, వైద్య, విద్యాశాఖ అధికారులు సమన్వయంత...

మెదక్ జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

జిల్లా కలెక్టర్ కు తెలంగాణ రైతు రక్షణ సమితి వినతి

మెదక్ జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి: జిల్లా కలెక్టర్ కు తెలంగాణ రైతు రక్షణ సమితి వినతి, మెదక్, అక్టోబర్ 29(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్ జిల్లా కమిటీ సభ్యులు ఈరోజు మెదక్ జిల్లా కలెక్టర్ కి రాష్ట్రంలో మెదక్ జిల్లాలో కరువు మండలాలుగా ఏకైక ఒకే మండలం మనోహరాబాద్ మండల్ ప్రకటించడం ,మెదక్ జిల్లా అన్ని మండలాలు కరువు మండలాలుగా ప్రకటించాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు .పసల్ బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పంట ఫసల్ బీమా పథకాన్ని అమలు చేసి ఉంటే ఈ టైం లో రైతుకు భరోసాగా ఉండేదని మైసయ్య యాదవ్ కలెక్టర్ కోరారు కలెక్టర్కు వివరించారు .దాని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఫసల్ బీమా పథకాన్ని రైతుకు భరోసాగా ఉంటాదని కలెక్టర్

వివరించారు .నవంబర్ మొదటి వారంలో జిల్లాలో అన్ని మండలాల గ్రామపంచాయతీ వారీగా రైతులకు గ్రామసభలు నిర్వహించాలని మెసేజ్ యాదవ్ కలెక్టర్ కోరారు వరి పంట కాకుండా ఇతర పంటలకు అవగాహన కల్పించాలని ఇతర పంటలు విత్తనాలు సబ్సిడ్లో ప్రభుత్వం అందించాలని కలెక్టర్ వివరించారు .దానికి కలెక్టర్ సరే అని స్పందించాలి అన్ని గ్రామ పంచాయతీలో అవగాహన సదస్సులు నవంబర్లో ఏర్పాటు చేస్తామని కలెక్టర్ అన్నారు.మెదక్ జిల్లా అన్ని మండలాలు కరువు మండలాలుగా ప్రకటించడానికి రెండో విడతలో మెదక్ జిల్లా కరువు జిల్లాగా ప్రకటించాలని కలెక్టర్ నీ కోరారు.ఈ సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అంతం గారి వెంకటేశం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్, కార్యదర్శి చందం నరేందర్ పెద్ద కొల్ల మల్లేష్ ఎల్లం యాదవ్, పరశురాములు నారాయణ రైతులు పాల్గొన్నారు

రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు విధిగా పాటించాలి

అదనపు కలెక్టర్ రాజాగౌడ్

నిజామాబాద్, అక్టోబర్ 29 :(విజన్ ఆంధ్ర)రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రత జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో వివిధ కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ దిశగా సంబంధిత శాఖలు కూడా సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను గుర్తించి ప్రమాదాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలను వేగవంతం చేసి,

పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలను వేగవంతం చేసి, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బాలానగర్ జాతీయ రహదారి పై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వద్ద రోడ్డు పనులు నవంబర్ 15లోగా ఒకవైపు రహదారిపై ట్రాఫిక్ ప్రారంభించాలని, మరోవైపు పనులను నవంబర్ 30లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్ . పి డి. జానకితో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ రహదారి భద్రతా పనులు, ప్రమాదకర ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు, పెండింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. పలుమార్లు గడువులు ఇచ్చినా పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పూర్తి చేయాలని, రోజువారీగా పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.

బాలానగర్ వద్ద కాంక్రీటు పనులు, కొంతమేర తారు పనులు పూర్తయ్యాయని, బిటుమెన్ కొరత కారణంగా డీబీఎం పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు వివరించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలేపల్లి వద్ద పెండింగ్ పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని, రాజాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద పనులను నిర్దేశిత గడువులోగా ముగించాలని ఆదేశించారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ముదిరెడ్డిపల్లి వద్ద అండర్‌పాస్, ఇరువైపులా సర్వీసు రోడ్లు, అదనపు అండర్‌పాస్ నిర్మాణ ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. అక్కడ ఆలయ తరలింపు, ఆక్రమణల తొలగింపు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన సమస్యలను తదుపరి సమావేశంలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిహారం చెక్కుల చెల్లింపుల్లో సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని, ఆలయ తరలింపునకు అవసరమైన అంచనాలు రూపొందించి సంబంధిత వర్గాలతో చర్చించాలని సూచించారు. గతంలో ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో రహదారిపై అవసరమైన భద్రతా ఏర్పాట్లు తక్షణమే చేపట్టాలని స్పష్టం చేశారు.

జడ్చర్ల బస్టాండ్ సమీపంలో రహదారి భద్రతకు అవసరమైన మార్పులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని సూచించారు. దేవరకద్ర రహదారిలో ట్రాక్టర్ షోరూమ్ సమీపంలో, బండమీదిపల్లి వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూత్పూర్ నుంచి దిమిటిపల్లి మీదుగా ఫ్లైఓవర్ వరకు ఉన్న రహదారిపై ఇటీవల ఆరు ప్రమాదాలు జరిగినట్లు అధికారులు వివరించగా, ప్రమాదాలకు కారణాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

రహదారులపై డివైడర్లు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన చోట డివైడర్లలో మార్పులు చేయడంతో పాటు విద్యుత్ స్తంభాలను మార్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

బైపాస్ రోడ్డుపై అక్రమ దుకాణాలపై చర్యలు

మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డు పరిసరాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాత్రివేళ ప్రమాదాలు జరగకుండా పోలీసు, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బైపాస్ రోడ్డుపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాత్రి పర్యవేక్షణను పెంచాలని పోలీసు అధికారులకు, అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

వాహన తనిఖీలపై నివేదిక ఇవ్వాలి

రవాణా శాఖ అధికారులు ప్రతి నెల నిర్వహిస్తున్న వాహన తనిఖీల వివరాలను తదుపరి సమావేశంలో సమగ్రంగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీ చేసిన వాహనాల సంఖ్య, నమోదు చేసిన కేసులు, అవసరమైన ధ్రువపత్రాలు లేని వాహనాలపై తీసుకున్న చర్యలు, విధించిన జరిమానాల వివరాలను అందించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా అవగాహన కల్పించడంతో పాటు నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రధానమంత్రి రాహత్ పథకం కింద ఆర్థిక సహాయం

రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోగా సమాచారం అందించడం, బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించడం ప్రధానమంత్రి రాహత్ పథకం కింద రూ. 1.50 లక్ష ఆర్థిక సహాయం పొందేందుకు కీలకమని తెలిపారు. 108 అత్యవసర సేవల సిబ్బంది ప్రమాద బాధితుల వివరాలను వెంటనే సంబంధిత అధికారులకు అందించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

రోడ్డు భద్రతకు సంబంధించిన చిన్న సమస్యలను సైతం నిర్లక్ష్యం చేయకుండా, ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడంకంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ పనులను తదుపరి సమావేశంలోగా పరిష్కరించి, పురోగతి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల శాఖ, పోలీసు, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

మహబూబ్‌నగర్ : మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి,జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్ గురువారం పర్యటించి గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో హాజరు, మూవ్‌మెంట్ రిజిస్టర్లతో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, గ్రామాభివృద్ధి పనుల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల హాజరు, ఆహార నాణ్యతను పరిశీలించారు. కేంద్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించి మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థుల కోసం భోజనశాల నిర్మించాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలోని వివిధ కాలనీలు, ఆవాస ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డ్రైనేజీ కాలువల శుభ్రత పనులు కొనసాగుతున్న తీరును గమనించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

ఎస్‌జీఎఫ్ 17 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో చౌటకూర్ పాఠశాలకు ప్రథమ స్థానం

- అద్భుత ప్రతిభతో విజేతగా నిలిచిన జెడ్పీహెచ్ఎస్ చౌటకూర్ విద్యార్థులు
- సమన్వయం, పట్టుదల, క్రీడా నైపుణ్యంతో ప్రత్యర్థి జట్లపై పైచేయి
- విద్యార్థుల విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సంతోషం

చౌటకూర్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ 17 (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో చౌటకూర్ పాఠశాల జట్టు విజేతగా నిలిచి పాఠశాలకు, చౌటకూర్ మండలానికి మంచి పేరు తీసుకువచ్చింది. ఈ పోటీల్లో విద్యార్థులు ప్రారంభం నుంచి చివరి వరకు ఎంతో ఉత్సాహంతో, పట్టుదలతో ఆడుతూ తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జట్టు సభ్యుల మధ్య మంచి సమన్వయం, క్రమశిక్షణ, పరస్పర సహకారం, సమయస్ఫూర్తితో ఆడి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ప్రత్యర్థి జట్లకు దీటుగా పోటీనిస్తూ ప్రతిభను చాటుకోవడం ద్వారా జిల్లా స్థాయిలో తమ సత్తాను నిరూపించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు ఉన్నత విజయాలు సాధించగలరని చౌటకూర్ పాఠశాల విద్యార్థుల విజయం మరోసారి నిరూపించింది. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థుల విజయానికి మార్గదర్శకత్వం వహించి, శిక్షణలో సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయుల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ్, రాజు విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ పాఠశాలకు, మండలానికి మరిన్ని విజయాలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. చౌటకూర్ పాఠశాల విద్యార్థులు సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆనందం నెలకొంది.

దేశం కోసం యువత నడుం బిగించాలి: ఎంపీ శ్రీమతి డీకే అరుణ

29, అక్టోబర్, 2026: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో మేరా యువ భారత్ మహబూబ్‌నగర్, ఉద్భవ్ సేవా సంసద్ ఆధ్వర్యంలో "యువ సంసద్" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలనే ఉద్దేశంతో 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' నినాదంతో పాటు 'ఎస్ఐఆర్'పై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం కోసం యువత నడుం బిగించాలని, ఉన్నత చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మత్తుకు బానిసై తమ అమూల్యమైన జీవితాలను చిత్తు చేసుకోవద్దని హితవు పలికారు. చాలా మంది 'ఎస్ఐఆర్' అంశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, దీనిద్వారా అర్హులైన వాస్తవికులకు ఓటు హక్కు లభించి దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీ కోసం కాదని, కేవలం దేశ భద్రత కోసం మాత్రమే పనిచేస్తుందని అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో పాలమూరు యూనివర్సిటీ వీసీ వీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్ బాబు, డీన్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సెల్ అధికారి డాక్టర్ ప్రవీణా పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా యువజన అధికారి కోటా నాయక్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్, ఉద్భవ్ సేవా సంసద్ అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ అర్జున్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

నీరు లేక వెలవెలబోతున్న సింగూరు,మంజీరా ప్రాజెక్టు!

- అక్టోబర్ మాసంలోనే డెడ్ స్టోరేజీ సింగూరు ప్రాజెక్టు.. భవిష్యత్తులో తాగునీటి కష్టాలు తప్పవా?
- వర్షాకాలంలోనే తగ్గుతున్న నీటి నిల్వలు
- రానున్న రోజుల్లో హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పవనే ఆందోళన
- కల్లెపల్లి వద్ద మోటార్లు ఏర్పాటు చేసి నీటిని లిఫ్ట్ చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్న విమర్శకులు

చౌటకూర్ అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర):- సంగారెడ్డి జిల్లాలో పుల్కల్ మండలం పరిధిలోని మంజీరా నది నీటి ప్రవాహం తగ్గిపోవడంతో సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వలు క్రమంగా తగ్గి వెలవెలబోతున్నాయి. ఒకప్పుడు సమృద్ధిగా నీటితో కళకళలాడిన సింగూరు ప్రాజెక్టు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుతూ డెడ్ స్టోరేజీ దిశగా పయనిస్తుండటంతో భవిష్యత్తులో తాగునీటి అవసరాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వర్షాకాలంలోనే ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న వేసవిలో తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సింగూరు జలాలపై ఆధారపడే ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరా విషయంలోనూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు కల్లెపల్లి వద్ద మోటార్లు ఏర్పాటు చేసి అందుబాటులో ఉన్న నీటిని లిఫ్ట్ చేసి ప్రాజెక్టులోకి తరలించే చర్యలు చేపట్టి ఉంటే ప్రస్తుత పరిస్థితి కొంత మెరుగ్గా ఉండేదని పలువురు విమర్శిస్తున్నారు. ముందస్తు ప్రణాళికతో నీటి నిర్వహణ చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వల పరిస్థితిని సమీక్షించాలని, ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వీరన్నపేటను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- రూ.40 కోట్లతో మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన
- వీరన్నపేటలో మరో సమీకృత గురుకుల పాఠశాల
రెండేళ్లలోపు అత్యాధునిక భవనాలు, వసతి గృహాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం
- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కృషితోనే మైనారిటీ పాఠశాలలకు నేడు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ అన్నారు. నగరంలోని వీరన్నపేట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో రూ.40 కోట్ల అంచనా వ్యయంతో రెండు మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తోలి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మహబూబ్‌నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ మైనారిటీ బాలికల పాఠశాలలను తిరిగి ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి లిరేవంత్ రెడ్డి లి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాను సమకూర్చి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును మళ్లీ కార్యరూపంలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, రెండేళ్లలోపు అత్యాధునిక భవనాలు, వసతి గృహాలతో పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని

ఆయన వెల్లడించారు. ఒక్కో పాఠశాలలో సుమారు 600 మంది చొప్పున మొత్తం 1,200 మంది బాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వీరన్నపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో నివసించే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

కూలీలు, రిక్షా, ఆటో డ్రైవర్లు, మెకానిక్‌లు, వ్యవసాయ కూలీలు, దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల కుటుంబాలకు చెందిన పిల్లలు సైతం అత్యుత్తమ సౌకర్యాలతో కూడిన పాఠశాలల్లో చదువుకోవాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యాసంస్థలు ప్రధాన రహదారులపై కనిపించేలా ఏర్పాటు చేయడం కంటే, పేద కుటుంబాలకు చేరువలో ఉండి వారి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడం ముఖ్యమని అన్నారు. నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తే స్థానిక తల్లిదండ్రుల్లో తమ పిల్లలను ఉన్నత ప్రమాణాలతో కూడిన పాఠశాలల్లో చదివించాలనే నమ్మకం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనారిటీ బాలికల కోసం రెండు గురుకుల పాఠశాలలతో పాటు, అన్ని వర్గాల పిల్లలకు విద్యావకాశాలు కల్పించేలా సమీకృత గురుకుల పాఠశాల (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విద్యాసంస్థల నిర్మాణం పూర్తయితే వీరన్నపేట ప్రాంతం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. విద్య ద్వారా పేద కుటుంబాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించడంతో పాటు, ప్రాంత అభివృద్ధికి బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వీరన్నపేట మహబూబ్‌నగర్ నగరంలోనే ప్రముఖ విద్యా కేంద్రంగా, అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించినందుకు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి కృతజ్ఞతలు

-సర్పంచి మల్లేశ్వరి

నాగర్ కర్నూలు జిల్లా, (ఫోటో జర్నలిస్ట్ మల్లేష్ బాబు) అక్టోబర్ 29 తెలకపల్లి మండల పరిధిలోని గౌరారం గ్రామ ప్రజల రవాణా ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ మల్లీశ్వరి, గ్రామంలోకి బస్సు సౌకర్యం కల్పించాలని సమస్యను ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డిదృష్టికి తీసుకెళ్లారు. ఆమె విజ్ఞప్తికి స్పందించి గ్రామంలోకి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడంతో గ్రామ ప్రజలకు ఊరట లభించింది. ఈ సందర్భంగా బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు సర్పంచ్ మల్లీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సౌకర్యంతో గ్రామం నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్లే విద్యార్థులు, ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని, ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు, ఆర్టీసీ అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు,గోరటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఛలో ఢిల్లీ జయప్రదం చేయండి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- సీఐటీయూ నూతన జిల్లా కార్యదర్శిగా డి.జగదీష్

హైదరాబాద్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం గురువారం సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లలను రద్దు చేయాలని ,కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం 42 వేల రూపాయలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కొంత మంది కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ ఒకటి రెండు మూడు తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు.

సీఐటీయూ నూతన జిల్లా కార్యదర్శిగా డి.జగదీష్

సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఇప్పటివరకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులుగా ఉన్న డి.జగదీష్ ను నూతన జిల్లా కార్యదర్శిగా కోఆప్షన్ చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.కవిత, జిల్లా అధ్యక్షుడు జే.రుద్రకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

ముధోల్:28అక్టోబర్:(విజన్ ఆంధ్ర) : ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్ వాష్ ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని అన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కున్నట్లయితే ఏలాంటి అంటు వ్యాధులు దరిచేరమవన్నారు. అదేవిధంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఫరత్ బేగం మాట్లాడుతూ.. హాస్టల్లో వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థులకు సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించాలన్నారు. అనంతరం విద్యార్థులచే చేతులు శుభ్రం చేసుకునే ఆరు దశల పోస్టర్లను

ప్రదర్శించారు. చేతులు కడుక్కునే విధానం, పద్ధతి పై పోస్టర్ల రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గురుచరణ్, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువ భారత్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించిన కాంతారావు

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 30: ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్న బృహత్తర యువ భారత్ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను గురువారం మాధవరం కాంతారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. స్వచ్ఛ భారత్ అంటే కేవలం వీధులను శుభ్రం చేయడమే కాదు, సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడం, బాధ్యతాయుతంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవడం అదే విధంగా రాత్రింబవళ్ళు దేశాన్ని కాపాడుతున్న మన సరిహద్దు సైనికులకు గౌరవంగా అండగా నిలవడం కూడా స్వచ్ఛమైన దేశ నిర్మాణంలో భాగమేనని కాంతారావు తెలియజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.

పార్కుల దుస్థితిని వెంటనే సరిదిద్దాలి

జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌కు జనసేన నాయకుల వినతి

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 30: కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లోని పార్కుల దుస్థితిని వెంటనే సరిచేసి, కాలనీవాసులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరుతూ జనసేన నాయకులు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. పార్కుల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడంతో పారిశుద్ధ్యం పూర్తిగా దెబ్బతిన్నదని నాయకులు పేర్కొన్నారు. పాముల సంచారం పెరిగి ఇళ్లలోకి వస్తుండటంతో కాలనీవాసులు, ముఖ్యంగా చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు, మద్యపానానికి అడ్డాలుగా మారుతున్నాయని వివరించారు. కాలనీవాసుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని పార్కులను శుభ్రం చేయడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించి, పాముల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, ఆళ్ల నరేంద్ర, పోలేబోయిన శ్రీనివాస్ గోవిందా, పి. గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- పశువులకు నాణ్యమైన పచ్చిమేత.. పశుపోషకులకు ఆర్థిక ప్రయోజనం

- జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి

సంగారెడ్డి, డెస్క్ : విజన్ ఆంధ్ర అక్టోబర్ 29:పశువులకు ఏడాది పొడవునా నాణ్యమైన పచ్చిమేత అందుబాటులో ఉంచడంతో పాటు పశుపోషకులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ప్రభుత్వం వ్యక్తిగత పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమం అమలు చేస్తోందని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన రైతులు తమ భూముల్లో పశుగ్రాస పంటలను సాగు చేసుకుని పశువులకు అవసరమైన మేతను సొంతంగా సమకూర్చుకోవచ్చని పేర్కొన్నారు. పశువులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పశుగ్రాసాన్ని సొంతంగా సాగు చేసుకోవడం వల్ల బయట నుంచి మేత కొనుగోలు చేయాల్సిన అవసరం తగ్గి, పశుపోషణ ఖర్చులను నియంత్రించుకోవచ్చని వివరించారు. తద్వారా రైతులకు అదనపు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమం కింద పశుగ్రాస సాగుకు అనువైన భూమి, అవసరమైన నీటి వసతి కలిగిన రైతులు అర్హత ప్రమాణాలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పశుగ్రాస సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు సామగ్రికి సంబంధించి వీబీ జీ రామ్ జీ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సహాయం అందించే అవకాశం ఉంటుంది. రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా అనువైన పశుగ్రాస పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ప్రభుత్వ సబ్సిడీ వివరాల కోసం సమీపంలోని పశువైద్యశాల లేదా సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి కోరారు.

ఎర్రవల్లి-వెంకటాపూర్ సరిహద్దుల సర్వే పూర్తి

- నాలుగు రోజులుగా కొనసాగిన క్షేత్రస్థాయి పరిశీలనకు ముగింపు

- సర్వే నంబర్ల వారీగా భూహక్కుదారులకు నోటీసులు

- కేసీఆర్ కుటుంబానికి నోటీసులుంటాయన్న ప్రచారం.. రైతుల్లో ఉత్కంఠ

సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 29:-సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఎర్రవల్లి, దాని శివారు గ్రామమైన వెంకటాపూర్ పరిధిలో గ్రామ సరిహద్దుల రీ-సర్వే ప్రక్రియ ముగిసింది. రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు నాలుగు రోజులపాటు నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వే గురువారంతో పూర్తయింది. గ్రామాల పరిధులను గుర్తించడం, సరిహద్దుల నిర్ధారణకు సంబంధించిన పనులను అధికారులు చేపట్టారు. సర్వేలో భాగంగా ఎర్రవల్లి, వెంకటాపూర్ పరిసర ప్రాంతాల్లోని భూముల హద్దులను అధికారులు పరిశీలించారు. బుధవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ వరకు వెళ్లి సర్వే నిర్వహించినట్లు సమాచారం. ఆయా ప్రాంతాల్లో సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను చేపట్టడంతో భూములకు సంబంధించిన తదుపరి పరిణామాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. గ్రామ సరిహద్దుల సర్వే ముగియడంతో అధికారులు ఇప్పుడు సర్వే నంబర్ల వారీగా భూముల వివరాల పరిశీలనపై దృష్టి సారించారు. భూములు కలిగి ఉన్న అనుభవదారులను గుర్తిస్తూ రోజువారీగా కొంతమందికి ముందస్తు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిసింది. సంబంధిత భూముల వివరాలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో హద్దులను నిర్ధారించే ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి కూడా ఒకటి రెండు రోజుల్లో సర్వే నోటీసులు అందే అవకాశం ఉందని సమాచారం ప్రచారంలో ఉంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నోటీసుల జారీకి సంబంధించి స్పష్టత రావాల్సి ఉండటంతో ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా వెంకటాపూర్ పరిసర ప్రాంతాల్లో భూములు కలిగిన కొందరు రైతులు సర్వే ప్రక్రియ, భూముల హద్దుల నిర్ధారణపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. భూముల రికార్డులు, సర్వే నంబర్లు, క్షేత్రస్థాయి హద్దుల పరిశీలన నేపథ్యంలో అధికారుల తదుపరి చర్యలపై రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సర్వే అనంతరం భూహక్కుదారుల వివరాల పరిశీలన, నోటీసుల జారీ ప్రక్రియ ఏ విధంగా ముందుకు సాగుతుందన్నది.

ఈ మొత్తం వ్యవహారం అధికార పార్టీ

ప్రతిపక్ష నాయకుని నాయకుని మధ్య భూముల వ్యవహారం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉ ందని ప్రజా సంఘాలు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి

.. అదనపు కలెక్టర్ పాండు

- ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహణ

సంగారెడ్డి, డెస్క్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 29: యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియం లో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా ఉత్సాహ భరితంగా జరిగాయి .

ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో సుమారు 400 మంది యువ కళాకారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్వామి వివేకానందుడు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తిని పెంపొందించేందుకు చేసిన బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వివేకానందుడు 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటులో అమెరికా

సోదరీమణులారా, సోదరులారా అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. యువత తమలోని ప్రతిభను వెలికితీసి, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలన్నారు. యువజనోత్సవాలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. స్వామి వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, సమాజ సేవతో పాటు దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గేయం, వీధి నాటకం, తదితర కళాంశాల్లో పోటీలు నిర్వహించారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు, అక్కడ ప్రథమ స్థానం పొందిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అధికారులు తెలిపారు. వచ్చే జనవరిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి సంబంధిత అధికారులు, యువ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మందిర భూమి పూజకి ఆహ్వానం పలికిన వీడీసీ

ఆర్మూర్, నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : హైదరాబాదు లోని జూబ్లీహిల్స్ ఆఫీస్ లో వినయ్ కుమార్ రెడ్డి గారిని. రామచంద్ర పల్లి వీడీసీ సభ్యులు తమ గ్రామంలో జరుగుతున్న హనుమాన్ మందిర నిర్మాణానికి భూమి పూజకు నవంబర్ 4వ తేదీన. రావాల్సిందిగా ఆహ్వాన. పత్రిక ఇచ్చి ఆహ్వానించిన వీడీసీ సభ్యులు.

దీనికి వినయ్ కుమార్ రెడ్డి గారు. సానుకూలంగా స్పందిస్తూ. తప్పకుండా హాజరవుత. నని హామీ ఇచ్చారు. వీడీసీ సభ్యులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి గారిని భూమి పూజకు ఆహ్వానిస్తూ వారి తరపున విరాళాన్ని అందించాలని విన్నవించారు దానికి వారు. సానుకూలంగా స్పందిస్తూ తన తరపున 51. వేల రూపాయల విరాళాన్నీ ఇవ్వడం జరిగింది.

హనుమాన్ మందిర్ నిర్మాణానికి విరాళాన్ని అందజేసిన వినయ్ కుమార్ రెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన రామచంద్ర పల్లె విడిసి. సభ్యులు మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు. తదితరులు ఉన్నారు.

ఆర్మూర్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా రక్తదాన శిబిరం

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో దేశ రక్షణ శాంతి భద్రతల కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఆర్మూర్ ఏ సీ పి వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. మరియు ఆర్మూర్ సిఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. పోలీసుల ఆధ్వర్యంలో గురువారం భారీ రక్తదాన. శిబిరాన్ని నిర్వహించారు.

ఆర్మూర్ లోని ఎమ్ ఆర్ గార్డెన్ వేదికగా ఈ కార్యక్రమం ఉదయం ప్రారంభమైంది ఈ రక్తదానం ప్రాణదానం రక్తదానం ఒక మహా దానం అనే నినాదాలతో మానవతా విలువలను చాటుతూ ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆర్గనైజర్ మాట్లాడుతూ ఒక యూనిట్ రక్తం ఒక అమూల్యమైన ప్రాణాన్ని కాపాడగలదని మనమందరం కలిసి సమాజంలో మానవ ప్రేమను బంధాలను కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు. ఈ శిబిరంలో. పోలీసు అధికారులు సిబ్బందితో పాటు స్థానిక యువత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు

ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సమాజ సేవ భద్రత మరియు న్యాయం అందించడంలోనే కాకుండా ప్రాణదాతలుగా నిలిచి సమాజం పట్ల తమకున్న బాధ్యతను పోలీసులు మరోసారి నిరూపించుకున్నారు.

రక్తదానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపి ప్రతి. ఒక్కరికి ఆర్మూర్ పోలీస్ విభాగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనెల హరి రఘు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై అఘాయిత్యా యత్నం ఆలస్యంగా వెలుగులోకి

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ లోని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న పాఠశాలలో మైనర్ బాలికపై మరో మైనర్ బాలుడు అఘాయిత్యానికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

బాలికను బెదిరించి అఘాయిత్యం యత్నం

వివరాల ప్రకారం ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక అదే సంస్థలో 8వ తరగతి చదువుతున్న మైనర్ బాలుడు ఉంటున్నారు గత నెల రోజుల క్రితం బాలిక బాత్రూంకు వెళ్లిన సమయంలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలుడు అక్కడికి వెళ్లి ఆమెను బెదిరించి అఘాయిత్యం యత్నించినట్లు సమాచారం. సెలవుల అనంతరం వెలుగులోకి ఈ విషయం దసరా సెలవుల కోసం ఇంటికి వెళ్లిన బాలికను తిరిగి పాఠశాలకు పంపించేందుకు బంధువులు ప్రయత్నించగా తాను అక్కడికి వెళ్లనని బాలిక నిరాకరించినట్లు తెలిసింది. స్వచ్ఛంద సంస్థలో ఉండేందుకు ఇష్టపడక పోవడంతో బంధువులు ఆరా తీశారు ఈ క్రమంలో తనపై జరిగిన ఘటనను బాలిక వారికి వివరించినట్లు

సమాచారం. సంస్థలో ఉంటున్న మరో మైనర్ బాలుడు తనను శారీరకంగా హింసిస్తున్నాడని బాలిక బంధువులకు తెలిపినట్లు తెలిసింది.

ఈ ఘటనపై బాధితురాలి బంధువులు ఆర్మూర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టి నిందితుడి పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం నిందితుడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కి తరలించినట్లు తెలిసింది. మైనర్ బాలిక భద్రత విద్యా సంస్థల్లో పిల్లల రక్షణ పై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తుందని తెలిసింది.

వెంకటసాయి ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స.

- 3.75 కిలోల భారీ గర్భాశయ ఫైబ్రాయిడ్ తొలగింపు.. రోగి ఆరోగ్యం నిలకడగా

- డాక్టర్ కృష్ణ శ్రావ్య కు అభినందనలు.



విజన్ ఆంధ్ర సిద్దిపేట చేర్యాల: వైద్య రంగంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటూ చేర్యాల పట్టణంలోని వెంకటసాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రికి చెందిన డాక్టర్ కృష్ణ శ్రావ్య 3.75 కిలోల భారీ గర్భాశయ ఫైబ్రాయిడ్ను శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ గోపాల్ రెడ్డి తెలిపారు.భారీ ఫైబ్రాయిడ్తో బాధపడుతున్న చేర్యాల మండలానికి చెందిన ఓ మహిళ ఆసుపత్రిలో చేరగా, వైద్య పరీక్షల అనంతరం గురువారం శస్త్రచికిత్స నిర్వహించి ఫైబ్రాయిడ్ను తొలగించినట్లు వెల్లడించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం నిలకడగాఉండటంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులకు, ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలుతెలిపారు.మహిళల ఆరోగ్య సమస్యలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వెంకటసాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పనిచేస్తోందని డాక్టర్ గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆధునిక వైద్య విధానాలతో చేర్యాల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. భారీ గర్భాశయ ఫైబ్రాయిడ్ను విజయవంతంగా తొలగించడం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవంను పురస్కరించుకొని

విద్యార్థినిలకు ఓపెన్ హౌస్ కార్యక్రమంపై అవగాహన

అచ్చంపేట అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని అచ్చంపేట పట్టణంలో గురువారం గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినీలకు పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా అచ్చంపేట ఎస్సై నరేష్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పనిచేసే విధానం డయల్ 112 సాంకేతిక విజ్ఞానంతో కేసులు చేదించడం తదితర విషయాలపై విద్యార్థినీలకు సూచన సలహాలు అందించి అవగాహన కల్పించారు కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు